జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 3-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 236 పేజీలు: 4 వెల : రూ.7



# సిక్కోలు.. శోభాయమానం

- వైభవంగా రథసప్తమి ఉత్సవాలు ప్రారంభం
- సూర్య నమస్కారాలతో శ్రీకారం
- ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి అరసవల్లి వరకూ శోభాయాత్ర
- ఉత్సాహంగా గ్రామీణ క్రీడల పోటీలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- విద్యుద్దీపాలతో ధగధగమెరిసిన సిక్కోలు
- పోలీసు వలయంలో నగరం
- హెలీ టూరిజం విశేష స్పందన

**శ్రీకాకుళం, ఫిబ్రవరి2 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్య నారాయణస్వామి రథసప్తమి ఉత్సవాలు ఆదివారం ప్రారంభ మయ్యాయి. ఈ ఏడాది రథసప్తమి ఉత్సవాలను కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. మూడు రోజులు పాటు ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించింది. ఈనేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఎన్నడూ లేనివిధంగా ఏర్పాట్లు చేసింది. సిక్కోలును సుందరంగా తీర్చిదిద్దింది. నగరంలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక ఉట్టిపడేలా చర్యలు చేపట్టింది. డేఅండ్ నైట్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకు, అలాగే పొట్టి శ్రీరాముల జంక్షన్ నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్ మీదుగా ఆదిత్యాలయం ఆర్చ్ వరకు విద్యుద్దీపాలతో అలంకరించింది. ఉత్సవంలో తొలిరోజు ఆదివారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో 5వేల మందితో సూర్యనమస్కారాలు, ధ్యానంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, యోగాసాధన, స్వచ్ఛంద, ధార్మిక సంస్థల సభ్యులు, విద్యార్థులు సామూహిక సూర్యనమస్కారాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాకుళం ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో గ్రామీణ క్రీడల పోటీలైన ఎత్తుడు రాయి. సంగిడీలు, కర్రసాము, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. అలాగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆదిత్యుని శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ రోడ్డు నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం వరకూ సాగింది. పలు రథాలపై స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి ఊరేగించారు. అన్నవరం సత్యదేవుని రథం, విజయవాడ దుర్గామల్లేశ్వర అమ్మవారి రథంతోపాటు టూరిజం, ఐటీడీఏ, మత్స్యశాఖ, న్యూక్లియర్ పవర్ ప్లాంట్, ఎయిర్‌పోర్టు, ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శకటాలతో యాత్ర నిర్వహించారు. కోలాట ప్రదర్శన, థింసా నృత్యం, సాంప్రదాయ కళావేదిక విద్యార్థుల ప్రదర్శన, పులి వేషాలు, కర్రసాము గారడీలు, గిరిజనుల డప్పుల నాట్యం, వివిధ కళారూపాలు ఈ యాత్రలో పాల్పంచుకున్నారు.



## హెలీ టూరిజం ప్రారంభం

డచ్ భవనం వద్ద ఆదివారం ఉదయం 11.30 గంటలకు హెలీ టూరిజం ప్రారంభమైంది. ఉదయం 9 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా మంచు అధికంగా ఉండడం వల్ల ప్రారంభమైంది. ఒక ట్రిప్ కు 6గురు చొప్పున హెలీకాప్టర్‌లో ఎనిమిది నిమిషాలు పాటు విహరించారు. మనిషి ఒక్కంటికి టికెట్ ధర రూ.1800గా నిర్ణయించారు. తొలుత కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవోలు హెలీకాప్టర్‌ను ఎక్కి కొద్దిసేపు శ్రీకాకుళం నగరంలో విహరించారు. ఆ తర్వాత జిల్లావాసులకు అవకాశం కల్పించారు. నగరవాసులు హెలీకాప్టర్ ఎక్కేందుకు సరదా పడ్డారు.



## సూర్యనమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం

### కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడి రథసప్తమి ఉత్సవాల సందర్భంగా ద్వాదశ సూర్య నమస్కారాలతో అరసవల్లి ఉత్సవాలను ప్రారంభించుకోవడం శుభ సంకేతమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి జగదీశ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు రామారావు ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వివిధ వర్గాలకు చెందిన వేలాది మంది ప్రజలంతా కలిసి యోగా ఆసనాలు వేశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ సూర్యనమస్కారాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 11 సంగమేశ్వర ఆలయ జాతర ప్రసాద వేలం

**వంగర, ఫిబ్రవరి 2 (వార్త):** సంగాం సంగమేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఈ నెల 26 మహాశివరాత్రి జాతరలో భక్తుల కోసం ప్రసాదం విక్రయం సందర్భంగా ఈ నెల 11 వేలం పాట జరగనుందని ఆలయ ఈఓ, శ్యామలరావు, చైర్మన్ బోను ఆనందరావు తెలిపారు. ఈ ప్రసాదం వేలం పాటకు ఎవరైనా హాజరై పాడుకోవచ్చునని వారు వివరించారు. ఈనెల 11 లోపు ప్రథమ ధరావత్తుగా రూ.25000 యలు చెల్లించాలన్నారు. భక్తులకు విక్రయించే ప్రసాదంలో పులిహోర 150 గ్రాముల రేటు రూ.10, లడ్డూ 80 గ్రాములు రేటు రూ.15 వంతున విక్రయించాల్సివుంటుందన్నారు. ఆలయ ఈవో, ఆలయ చైర్మన్ బోను ఆనందరావు తదితర గ్రామ పెద్దల సమక్షంలో వేలం పాట ఉంటుందన్నారు.



# మీకన్నా పిల్లలే నయం!

* వాహనదారులపై బారువ ఎస్ఐ ఆగ్రహం * నిబంధనలు పాటించాలని అవగాహన

**సోంపేట, ఫిబ్రవరి 2 (వార్త):** జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్లు ధరించాలని ప్రతిరోజూ బాధ్యత గుర్తుచేస్తున్నప్పటికీ మీలో మార్పు కనిపించడంలేదు.. ఒకసారి చెబితే పిల్లలు దాన్ని గ్రహించి రెండోసారి ఆ తప్పు చేయడం మానుకుంటారు.. పిల్లలకున్న విజ్ఞత మీకు లేకపోవడం పద్ధతిగా లేదు.. అని బారువ ఎస్సై హరిబాబు నాయుడు ప్రయాణికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పాలవలస రైల్వే గేట్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణం చేస్తున్న వారిని ఆపి క్లాస్ పీకారు. గడచిన కొద్ది నెలలుగా రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని సురక్షితంగా ప్రయాణాలు చేసి గమ్య స్థానాలకు చేరుకోవాలని పోలీసులు నెత్తినోరు బాదుకుని చెబుతున్నా నిర్లక్ష్యం వహించడంపై ఆయన మండిపడ్డారు. హెల్మెట్ ఉండి అది పక్కనపెట్టి ప్రయాణించేవారు, ఆటోలపై పరిమితికి మించి ప్రయాణీకులను



తరలిస్తున్న డ్రైవర్లను పిలిచి ఇదేమి పద్ధతి అని ప్రశ్నించారు. అక్కడ వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు నిబంధనలపై మరోసారి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతలు గుర్తెరిగి మసలుకుంటే ప్రమాదాలు జరగవని సూచించారు. జరిమానాలను విధించడం పెద్ద పని కాదని ప్రజల్లో మార్పు తేవాలని ఉద్దేశంతో నిరంతరం పోలీసులు అవగాహన కార్యక్రమాలు, వాహనాలు తనిఖీలు చేస్తున్నారన్నారు. వాహనచోదకులు ఇకనైనా నిబంధనలు పాటించాలని ఎస్ఐ సూచించారు.




## జిల్లా అబాకస్ పోటీల్లో మెళియాపుట్టి విద్యార్థుల ప్రతిభ

**మెళియాపుట్టి, ఫిబ్రవరి 2 (వార్త):** అబాకస్ జిల్లాస్థాయి పోటీల్లో మెళియాపుట్టి మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అందులో భాగంగా నలంద, యూనివర్సియల్, విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ఇరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జె జె ఎస్ ప్రతాప్, కలమట శేఖర్లు తెలిపారు. మండలంలో ఆయా పాఠశాలల చెందిన వారు ఆదివారం ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన జిల్లా కేంద్రంలో వికాస్ పాఠశాలలో విశ్వం ఎడ్యుకేషనల్ ల్యాబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ పోటీలో జిల్లాస్థాయిలో 40 పాఠశాలకు చెందిన 750 విద్యార్థులు పాల్గొన్నారన్నారు. మెళియాపుట్టి మండలం లో యూనివర్సియల్ పాఠశాలకు చెందిన సీనియర్ విభాగం నుంచి ఏడవ తరగతికి చెందిన డి.శృతి విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. అలాగే నలంద పబ్లిక్ పాఠశాలకు చెందిన యు. హర్షవర్ధన్ రెడ్డి నాల్గవ తరగతికి చెందిన విద్యార్థి విజయం సాధించారన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను నిర్వాహణ సంస్థ అందించినట్టు వారు తెలిపారు.

# చిత్తడి నేలల పరిరక్షణ మన భవిష్యత్‌కు రక్షణ

## నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో ఆర్డినేటర్ లోకేశ్వరరావు

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 2 (వార్త):** భూమిపై ప్రాణికోటి మనగడకు చిత్తడి నేలలే మూలమని నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో ఆర్డినేటర్ టి.లోకేశ్వరరావు అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ఎన్జిసి డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోరుభద్రలో ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ చిత్తడి నేలలు సహజ నీటి శుద్ధి కేంద్రాలుగా వర్షపు నీటిని భూగర్భానికి చేరుస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడే అద్భుత నేలలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ మాట్లాడుతూ చిత్తడి నేలలు భూకంప ఉధృతిని తగ్గించడంలో, వాతావరణ మార్పులను నియంత్రించడంలో, జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో కీలక భూమిక పోషిస్తాయని అన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు డి.ఉమాశంకర్ మాట్లాడుతూ కాలుష్య కారకాలు గ్రహించి నీటి నాణ్యతను పెంచడంలో చిత్తడి నేలలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని అన్నారు. అనంతరం 'చిత్తడి నేలల పరిరక్షణ – ఆవశ్యకత' మీద విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం చిత్తడి నేలలు పరిరక్షణకు ప్రజలు నడుము బిగించాలని నినాదాలు చేస్తూ విద్యార్థులు చేత ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, సాంఘిక




శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు,ఉపాధ్యాయులు టి.లోకేశ్వర రావు, డి.ఉమా శంకర్, వెంకట రెడ్డి, కె.త్రినాధ రావు, డి.ఉమాదేవి,కె.రమణమ్మ, టి.విజయ లక్ష్మి, బి.నాగమణి, కె.తవిటి రెడ్డి, బి.రజని, జి.జగదాంబ, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతి రావు, శంకర రావు, గోపాలరెడ్డి, కమల కుమారి, సుశీల దేవి, సాయి శివాని, కృష్ణ, త్రివేణి, పాల్గొన్నారు

## యుటి రెడ్డి ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2 (వార్త):** బెల్లుపడ ఈదుపురం రహదారిలో నయరా పెట్రోల్ బంక్‌ను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. ఉప్పాడ సోమేశ్ రెడ్డి యు టి రెడ్డి ఫిల్లింగ్ స్టేషన్ పేరుతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నల్ లెండింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

**మందస, ఫిబ్రవరి 2(వార్త):** మహిళా సంఘాలు ఇంటర్నల్ లెండింగ్‌కు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. మందస మండలంలోని సిద్దిగాం గ్రామ సంఘంలో స్వయం సహాయక సంఘాల నిర్వహణ తనిఖీ చేశారు. అనంతరం సంఘం సభ్యులతో కూర్మారావు మాట్లాడుతూ సేవింగ్ ఖాతాలలో నిధులను సభ్యురాలి అవసరం మేరకు సంఘం తీర్మానం ఆధారంగా పొదుపు నుంచి అప్పులు ఇచ్చుకుని, తిరిగి వాయిదాల ప్రకారం వడ్డీతో సహా సంఘం ఖాతాకు జమ చేసుకోవాలని సూచించారు. సంఘం ప్రారంభం నుంచి నేటి వరకు అన్ని సంఘాలను కూడా కమ్యూనిటీ ఆడిటర్స్ తో ఆడిట్ చేయించుకోవాలని వివరించారు. ఆడిట్ చేయించుకొని సంఘాలను సభ్యురాల వారి సంఘం వారి లావాదేవీలన్నీ ఖచ్చితంగా లేనందున అలాంటి సంఘాలన్నీ డీ గ్రేడ్ లోనికి వెళ్తున్నట్లు సభ్యులకు అవగాహన కల్పించారు. పంచ సూత్రాలు పాటిస్తున్న మంచి సంఘాలలో వ్యక్తిగతంగా ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న మహిళలకు బ్యాంకులలో వ్యక్తిగతంగా ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్ రుణాలు ఇప్పించాలని తెలిపారు. మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్ బ్రాండింగ్ నిర్ణయించుకొని వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి డిజిటల్ కామర్స్ కోసం ఆన్లైన్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఓఏ లక్ష్మీతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్ బాల కృష్ణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, గ్రామసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.





## రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి ఘన స్వాగతం

### జై జవాన్ అంటూ మార్మోగిన మఖరజోల

**మందస, ఫిబ్రవరి 2(వార్త):** జై జవాన్ అంటూ మందస మండలంలోని మఖరజోల గ్రామం మార్మోగింది. ఈ ప్రాంతంలో ఉన్న సంప్రదాయాన్ని గ్రామస్తులు పాటించారు. దేశరక్షణకు పాటు పాడుతూ, నిద్రహారాల్లేకుండా పని చేసే సైనికులను ఈ ప్రాంతీయులు ఎంతో గౌరవిస్తారు. దీనిలో భాగంగా మఖరజోల



గ్రామానికి చెందిన కొండ గాంధీ అనే సైనికుడు ఇండియన్ ఆర్మీలో 24 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పని చేశారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన గాంధీకి పలాస రైల్వేస్టేషన్లో ఘన స్వాగతం లభించింది. అక్కడ నుంచి ర్యాలీగా మఖరజోల వరకు గాంధీని తీసుకువచ్చారు. దారి పొడవునా జైజవాన్, జైకిసాన్ అంటూ నినాదాలు చేశారు. గ్రామంలో అంతా కలిసి ఉద్యోగ విరమణ చేసిన గాంధీని ఘనంగా సన్మానించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ దేశ రక్షణలో తన జీవితకాలం పని చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. గ్రామస్తులు చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జేసీఐ అధ్యక్షులుగా జయదేవ్ యాదవ్

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 2 (వార్త):** జేసీఐ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కాళ్ల జయదేవ్ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ హాజరయ్యారు. 8వ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జోన్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, మాజీ జాతీయ ఉపాధ్యక్షురాలు రజిత పూసర్ల, జోన్ వైస్ ప్రెసిడెంట్ చంద్ర శేఖర్, పూర్వపు అధ్యక్షులు షణ్ముక్ తదితరులు పాల్గొన్నారు.




## ఆలయ ఉత్సవాల్లో చైర్‌పర్సన్ విజయ

**మందస, ఫిబ్రవరి 2(వార్త):** బిన్నళమదనాపురం గ్రామంలో సీతారామ స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు సాదర స్వాగతం పలికి సన్మానించారు. గత రెండు రోజులుగా బిన్నళ ఆలయ ప్రతిస్థాపన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పలువురు ఆహ్వానితులను గ్రామస్తులు సన్మానించారు.



జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## మృతుడి కుటుంబానికి రూ.20వేలు సాయం

**మందస, ఫిబ్రవరి 2(వార్త):** మందస మండలంలోని అంబుగాం గ్రామంలో బైకిలపోలమ్మతల్లి మోటార్ యూనియన్ సంఘంలో సభ్యుడిగా ఉంటున్న సిందిరి జోగారావు ఇటీవల మరణించాడు. చిన్న, చిన్న కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్న జోగారావు మరణంతో ఆ కుటుంబం దిక్కు తోచనిస్థితికి చేరుకుంది. దీంతో మృతుని కుటుంబానికి శ్రీ బైకిలపోలమ్మతల్లి మోటర్ యూనియన్ సభ్యులు 20వేల రూపాయలు ఆర్థిక సాయం భార్య సిందిరి సుశీలకు అందజేశారు. కార్యక్రమంలో మోటర్ యూనియన్ సంఘ అధ్యక్షులు రాజమండ్రి రాజారావుతో పాటు సభ్యులు పాల్గొన్నారు.






## జ్ఞాన భారతిలో వసంత పంచమి వేడుకలు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి2(వార్త):** స్థానిక జ్ఞానభారతి పాఠశాలలో వసంత పంచమి వేడుకలు పాఠశాల కార్యదర్శి, కార్యనిర్వాహణ అధికారి జోహార్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఉచిత సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. వేద పండితులు తేన్నేటి తేజేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి కార్యనిర్వాహణాధికారి పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగ్, రెండు జతల పాఠశాల యూనిఫారం అందించారు. ఈ సందర్భంగా జోహార్ ఖాన్ మాట్లాడుతూ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాన్ని ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని, ఈనెల 5వ తేదీ వరకు పాఠశాలలో చేరే విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శవపేటిక వితరణ




**వంగర, ఫిబ్రవరి 2 (వార్త):** రాజాంకు చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహాయంతో ఎలక్ట్రికల్ ఫ్రీజర్‌ను వంగర మండల కేంద్రంలో అందుబాటులోకి తెచ్చింది. సంస్థ అధ్యక్షుడు కాంబోతుల రమణ ఆదివారం విద్యుత్ శీతల శవపేటికను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిసర ప్రాంత ప్రజలకు ఇది ఉపయోగపడుతుందన్నారు. గత కొన్నేళ్ల నుంచి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని సంస్థ ప్రతినిధులు బెవర సాయిరాం, బలగ పోలినాయుడు మజ్జి గణపతి వివరించారు. శవపేటిక అవసరమైన వారు 94414 14966, 7989936310 ఈ ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

## 'డాక్టర్ సీదిరి నమ్మకాన్ని వమ్ముచేయను'



**పలాస, ఫిబ్రవరి2 (వార్త):** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఎంతో నమ్మకంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా నియమించారని, ఆయన నమ్మకాన్ని వమ్ముచేయనని శిష్టు గోపి అన్నారు. 20వ వార్డులో వార్డు ప్రతినిధి అంబటి ఆనందరావు ఆధ్వర్యంలో ఆదివారం శిష్టు గోపిని పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో మారు మున్సిపాలిటీలో పార్టీ జెండా ఎగుర వేసేలా తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు బడగల బల్లయ్య, అంబటి ఆనందరావు, గజ్జి బాలయ్య, బమ్మిడి సుధాకర్, పల్లేటి గణపతి, పినకాన ముకుంద రావు, బగాది సింహాచలం, కొనారి ఆది, అర్జాల ఆదినారాయణ, కోనేరు కాళీదాసు, లండ రమణ, పల్లేటి కామేష్, ధర్మాపు మురళి, కోవిరి దేవరాజు, పెరిమల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 8 వరకు గ్రీవెన్స్ రద్దు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 2 (వార్త):** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మార్చి8 తేదీ వరకు ఆయా సోమవారాలలో నిర్వహించే గ్రీవెన్స్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక - గ్రీవెన్స్) రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గ్రామ సచివాలయంలో ఫిర్యాదులను సమర్పించడానికి 'మీకోసం' ఆన్‌లైన్ పోర్టల్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు.

# నర్సింగపురం ఒడియా పాఠశాలకు కష్టాలు

* మంచినీరు లేక విద్యార్థులు అగచాట్లు
* ప్రహరీ లేక బిక్కుబిక్కుమంటోన్న విద్యార్థులు
* అడవి ప్రక్కనే ప్రభుత్వ పాఠశాల



**మందస, ఫిబ్రవరి 2(వార్త):** అదో ప్రభుత్వ పాఠశాల.. ఊరికి దూరంగా ఉంది.. ఒడియా పాఠశాల కావడంతో ఆదరణ కాస్త తక్కువగానే ఉంటుంది. విద్యార్థులకు సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఒడియా విద్యార్థులు సమస్యలతో బాధలు పడుతున్నారు. పలుమార్లు సమస్యలు తీర్చమని కోరినా, ప్రజాప్రతినిథులు, అధికారులు స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామంటోన్న పాలకుల ఈ పాఠశాల కష్టాలు ఒక్కసారి చూడాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని నర్సింగపురంలో మండల ప్రాథమిక (ఒడియా) స్కూల్ ఉంది. ఒడియా ఈ ప్రాంతంలో మైనార్టీ కావడంతో ఒడియా విద్యార్థుల సమస్యను పట్టించుకోవడంలేదని ఒడియా కులస్థులు ఆరోపిస్తుంటారు. గ్రామానికి దూరంలో ఉన్న ఈ పాఠశాలలో మంచి నీటి సౌకర్యంలేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవికాలం సమీపిస్తుండడంతో మరిన్ని కష్టాలు తప్పవని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మరుగుదొడ్లుకు రన్నింగ్ వాటర్ లేకపోవడంతో విద్యార్థులు భయం, భయంగా బయటకు వెళ్తున్నారు. కూతవేటు దూరంలో అడవి ఉండడంతో నిత్యం అడవి జంతువుల అరుపులతో పాటు నక్కలు, అడవి పందులు, పాములు, తేళ్లు, పెద్దపెద్ద జెర్రిలు నిత్యం పాఠశాల చుట్టూ తిరుగుతుంటాయి. కొన్ని పాఠశాలలోకి వస్తుంటాయి. దీంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. అదేవిధంగా ఎప్పటి నుంచో ప్రహరీ కావాలని గ్రామస్తులు కోరుతున్నప్పటికీ, స్పందించేనాథుడే కరవయ్యారు. పాఠశాల పైకప్పుపై ఉన్న వాటర్ ట్యాంక్ పాడవ్వడంతో ఆ విద్యాలయం కష్టాలు చెప్పనలవికావడంలేదు. కాగా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయరాంమాలి మాట్లాడుతూ ఓ మారుమూల ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల సమస్యలను పరిష్కరించబడడంలేదని, అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉండడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిథులు, అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.



# ఉత్సాహంగా గ్రామీణ క్రీడా పోటీలు

**శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి2(వార్త):** రథసప్తమి వేడుకల్లో భాగంగా ఎన్‌టిఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో గ్రామీణ క్రీడలను ఆదివారం ప్రారంభించారు. గ్రామీణ క్రీడలు కర్రసాము, ఇసురు గుండు, పిల్ల మొగ్గలు ఉలవలు బస్తా, తీట సంగిడి, ఈడుపు సంగిడి క్రీడలు నిర్వహించి విజేతలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేశారు. వెయిట్ లిఫ్టింగ్ లో గెలుపొందిన వారికి మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు కొనసాగుతున్నాయి. 3వ తేదీన ఫైనల్ జరుగనుంది. ఈ సందర్భంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పది మంది పురుషులు, ఏడుగురు మహిళలు పాల్గొన్నారు.






వెయిట్ లిఫ్టింగ్ పురుషుల విభాగంలో ఆవుల గోవిందరావు - నిమ్మాడ 160 కేజిలు విభాగం. మొదటి బహుమతి రూ.5000, ముద్దాడ తరుణ్ - తంగివాణిపేట - 140 కేజీలు విభాగం. ద్వితీయ బహుమతి - - రూ.3000, గుజ్జల ట్వింకిల్ కుమార్ - ఆడవరం - 135 కేజీల విభాగం రూ.2000 నగదు బహుమతులు పొందారు. అలాగే మహిళా విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ లో గెలుపొందిన గుజ్జల వర్షిత - ఆడవరం - మొదటి బహుమతి - 95 కేజీల విభాగం. రూ.5000, దూబ హేమశ్రీ - బూరవల్లి - రెండవ బహుమతి - 90 కేజీల విభాగం. రూ.3000, సిహెచ్. హారికారాజ్ - కొర్లకోట - మూడవ బహుమతి - 50 కేజీల విభాగం. రూ.2000 కైవసం చేసుకున్నారు. గ్రామీణ క్రీడలైన కర్రసాములో మహిళా విభాగంలో సాహితి సౌమ్య - శ్రీకాకుళం - మొదటి బహుమతి రూ.5000, బి. శ్రీ కళా - శ్రీకాకుళం - రెండవ బహుమతి - రూ.3000, తన్మయి - శ్రీకాకుళం - మూడవ బహుమతి - రూ.2000 పొందారు. పురుషుల విభాగం కర్రసాములో కె. యుగందర్ - నరసన్నపేట - మొదటి బహుమతి - రూ. 5000, సిహెచ్. రాంరేవంత్ - నరసన్నపేట - రెండవ బహుమతి - రూ.3000, ఆర్. నరేంద్ర నాయుడు - శ్రీకాకుళం - మూడవ బహుమతి - రూ.2000 సాధించారు. ఇసురు గుండులో గేదెల సత్యనారాయణ - వప్పంగి - మొదటి బహుమతి - రూ.5000, గేదెల రమణ - వప్పంగి - రెండవ బహుమతి - రూ.3000, ముద్దాడ వెంకటేష్ - తమ్మినాయుడు పేట - రూ.2000 కైవసం చేసుకున్నారు. అలాగే మరికొన్ని గ్రామీణ క్రీడలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్డీఓ శ్రీధర్, స్పోర్ట్స్ సెక్రటరీ పెంకి సుందరరావు, కోచ్ లు ఎఆర్ డిఎస్పీ అప్పన్న, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రాయింగ్ పోటీ విజేతలకు కలెక్టర్ అభినందన

**శ్రీకాకుళం, ఫిబ్రవరి2(వార్త):** రథసప్తమి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన ఆర్ట్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం డచ్ భవనం వద్ద అభినందించారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా జిల్లాలో ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు, ఉన్నత పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రథసప్తమి వేడుకల సందర్భంగా చిత్రాలు మాట్లాడుతాయి పేరు తో సమగ్రత సమానత్వం కాన్సెప్ట్‌తో డ్రాయింగ్ పై పోటీలు నిర్వహించగా 645 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన సెంట్ జోసెఫ్ స్కూల్ లో ఐదో తరగతి చదువుతున్న కె. యశ్వంత్ సాయి, శ్రీ చైతన్య స్కూల్ లో ఐదో తరగతి చదువుతున్న ఎం. నేహ అభియత్, శాంతినికేతన్ లో ఐదో తరగతి చదువుతున్న బి. రోషిని, ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎవిఎన్ఎంహెచ్ స్కూల్ లో పదో తరగతి చదువుతున్న జి. దేవరాజు, ప్రభుత్వ హైస్కూల్ శ్రీకాకుళంలో పదో తరగతి చదువుతున్న సిహెచ్. ప్రేమ్ కుమార్, ఎపి ఎంఎస్ జి. సిగడాంలో పదో తరగతి చదువుతున్న కె. యాశితలను జిల్లా కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు డ్రాయింగ్ చేసి గెలుపొందిన చిత్రాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఉచిత హెలీటూరిజం విహారానికి అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప కలెక్టర్ లక్ష్మణమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య పాల్గొన్నారు.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





# శోభాయాత్ర.. జైత్రయాత్ర

* సామాన్య భక్తులకు వీఐపీల కంటే ముందే దర్శనం కావాలి * రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * యాత్రను ప్రారంభించిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు * దారి పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు * ఆకట్టుకున్న రథాలు

**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 2 (వార్త):** అరసవల్లి రథసప్తమి సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర ఓ జైత్రయాత్రను తలపించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని అంబేద్కర్ కూడలి నుంచి అరసవల్లి ఆలయం వరకు భారీగా శోభాయాత్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మంత్రి అచ్చెన్నాయుడు అరసవల్లి సూర్యనారాయణస్వామి భక్తునిగా ఈ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా ప్రజలకు ఎనిమిది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో ఎన్డీఏ అభ్యర్థులకు గొప్ప విజయాన్ని అందించారు. జిల్లా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అరసవల్లి రథసప్తమి ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని సీఎం చంద్రబాబునాయుడును కోరడం జరిగిందన్నారు. ఆయన రథసప్తమిని రాష్ట్ర పండుగగా గుర్తించడంతో ఈ ఏడాది మూడు రోజుల పాటు పండుగ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. దీంతో యుద్ధప్రాతిపదికన పాలకొండ, కళింగ రోడ్డులో ఆధునీకరణ పనులను చేపట్టామని వివరించారు. అదే విధంగా ఆలయ నిర్మాణ పనులను కూడా పూర్తి చేయగలిగామని తెలిపారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు చేపట్టిన శోభాయాత్రకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఊహించినంతగా తరలిరావడం ఆనందంగా ఉందని చెప్పారు. జిల్లాలో ఉన్న కళారూపాలను, రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన ఆలయాల నమూనాలను, జిల్లాలోని పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాల నమూనాలను ప్రదర్శించారని తెలిపారు. గతంలో తానెప్పుడూ ఆలయ స్వరూపాన్ని పూర్తిగా చూడలేదని ఇప్పుడు ఇంద్రపుష్కరిణి నుంచి చూస్తే ఆలయం పూర్తిగా కన్పిస్తోందని వివరించారు. భవిష్యత్‌లో రూ.100 కోట్ల కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం నిధులతో ఆలయంతో పాటు నగరాన్ని సుందరీకరణ చేపడతామని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని, ఇటువంటి మంచి పనులు చేస్తే ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు. భక్తులు రెండు రోజుల పాటు ఆనందంగా మెలిగి రథసప్తమి రోజు స్వామి వారిని ప్రశాంతంగా దర్శించుకోవాలని తెలిపారు. వీఐపీల కంటే పది నిమిషాల ముందు సామాన్య భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలని ఇదే తమ లక్ష్యమని అచ్చెన్నాయుడు వివరించారు. గతంలో ఆలయానికి ఐదు కిలోమీటర్లు ముందే జనాలను నిలిపి వేసి నడిచే పరిస్థితి ఉండేదని, కానీ నేడు ఆలయం నలుమూలలా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం చరిత్రలో నిలిచిపోయేలా సూర్యనమస్కారాలు ఐదు వేల మందితో నిర్వహించామని వివరించారు. ఎపీకి కేంద్ర ప్రభుత్వం ఏం ఇవ్వలేదని కొందరు అవాకులుచవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడుకు కేంద్రం వద్ద ఎప్పుడు వెళ్లాలన్నా క్లీన్‌చీట్ ఉందని అన్నారు. ఈ ఏడు నెలల కాలంలో చంద్రబాబు 70 సార్లు కలిశారని వివరించారు. ఈ ఏడు నెలల్లో పోలవరానికి రూ.12,500 కోట్లు, అమరావతికి రూ.15వేల కోట్లుతో రైల్వేజోన్ ప్రకటించిందని తెలిపారు. విశాఖ ఉక్కును ఆదుకునేందుకు రూ.12,500 కోట్లు మంజూరు చేసి ఊపిరి పోశారన్నారు. గతంలో జలజీవన్ పథకాన్ని కేంద్రం మంజూరు చేసి ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా ప్రజలను మోసగించారని వివరించారు. 2025తో ఈ పథకం ముగుస్తుందని తెలుసుకున్న చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన తరువాత 2028 వరకు ఈ పథకాన్ని పొగిడించారని గుర్తు చేశారు. ప్రతీ ఇంటికి 24 గంటల పాటు తాగునీరు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, చౌదరి బాబ్జి, మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.











జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





# సాంస్కృతిక ప్రదర్శనలు..

# ధూంధాం!



**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 2 (వార్త):**రథసప్తమి వేడుకల్లో భాగంగా తొలిరోజు ఆదివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా అలరించాయి. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన విశాల వేదికపై ప్రముఖ కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. వేడుకల్లో భాగంగా లైట్ మ్యూజిక్, సినీ సంగీతం, శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ జానపద సంగీతం, శాస్త్రీయ నృత్యం వంటి వివిధ కళా ప్రదర్శనలు జరిగాయి. ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్, దుంపల ఈశ్వర్ బృందం, యామినీ కృష్ణ బృందం, పరిమళ బృందం, అనురాధ బృందం, లక్ష్మీ గణపతి శర్మ బృందం వంటి ప్రముఖ కళాకారులు తమ గాన, నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు. ధూంధాం కార్యక్రమం పేరిట ఆటో రాంప్రసాద్, నరేష్, శాంతి స్వరూప్, ఫైమా, ఢీ భూమిక, రేలారే రేలా టీమ్, మిమిక్రీ ఆనంద్, జోష్ శివ, పిన్నీ సాంగ్ ఫేమ్ షన్ముఖ్, సురేష్ రేష్మ (సింగింగ్), బాలాజీ (శ్రీకాకుళం) పాల్గొని తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. లేజర్ షో కనువిందు చేసింది. శ్రీ అంజనా కళా సంస్థ సమర్పించిన పంచరత్న పౌరాణిక నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.













జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





# పోలీసులు.. భేష్







*** నగరం.. పోలీస్‌మయం * 2300 మందితో బందోబస్తు * ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు * సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా * కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షణ**

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 2 (వార్త):** రథసప్తమి వేడుకల్లో భాగంగా శ్రీకాకుళం నగరాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. నగరం నలు దిక్కులు పోలీసులు చుట్టుముట్టేశారు. అన్ని జంక్షన్లలో పోలీసు బందోబస్తు కనిపించింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు చేపట్టారు. విశాఖ రేంజ్ డీఐజీ, ఎస్పీతో కలిసి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సూర్యనమస్కారాలు, శోభాయాత్ర, గ్రామీణ క్రీడలు నిర్వహించే ప్రాంతాలతో పాటు ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక వేదిక వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టారు. ఒక ప్రణాళికతో ముందుకుసాగడంతో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో పోలీసులు పర్యవేక్షించారు. ఎక్కడా ట్రాఫిక్‌కు అవాంతరాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## 2300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు: ఎస్పీ

రథసప్తమి వేడుకల్లో 2300 మంది పోలీసులు, అధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు అధికారులతో ఆయన సమీక్షించి దిశానిర్దేశం చేశారు. పోలీస్ కమాండ్ కంట్రోల్‌ను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా క్యూ లైన్లలో ముందుకుసాగేలా చూడాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం చేయించాలన్నారు. మొత్తం బందోబస్తుని 20 సెక్టార్లులుగా విభజించామన్నారు. ముగ్గురు ఏఎస్పీలు, 15 మంది డీఎస్పీలు 49మంది సీఐలతో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారన్నారు. శ్రీకాకుళం విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విశాఖపట్నం సిటి నుంచి పోలీసు శాఖ సిబ్బంది, అధికారులు ఈ బందోబస్తులో పాల్పంచుకుంటున్నారని చెప్పారు. డ్రోన్, సీసీ కెమెరాలను అనుసంధానం చేస్తూ భక్తులకు అందుబాటులోను ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.





## ఏర్పాట్లు పరిశీలించిన విశాఖపట్నం రేంజ్ డీఐజీ

రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. అరసవల్లి ఆలయం, ఇంద్రపుష్కరిణి, మిల్లురోడ్డు, తదితర జంక్షన్‌లను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను డీఐజీ సంద ర్శించి బందోబస్తు ఏర్పాటు, క్యూ లైన్లు, ఆలయ పరిసరాలను క్షుణ్నంగా పరిశీలించారు. ఆర్ట్స్ కళా శాల మైదానంలో జరగనున్న సాంస్కృతిక కార్యక్ర మాలకు బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు.







# పెళ్లికి ఒప్పుకోలేదని దాడి

*** విద్యార్థినిపై దాడి ఘటనలో వ్యక్తి అరెస్టు * వివరాలు వెల్లడించిన ఎస్పీ**
*** కేసు ఛేదించిన పోలీసులకు ప్రశంసలు**



**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 2(వార్త):** విద్యార్థినిపై దాడి ఘటనలో ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆదివారం ఎస్పీ వెల్లడించారు. గత నెల 31న నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న కొరికాన లక్ష్మిపై దాడి ఘటనలో ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారన్నారు. దాడి జరిగిన తర్వాత విద్యార్థిని సెల్‌ఫోన్ మాయమైందని, టవర్ లొకేషన్ ఆధారంగా ఆ సెల్‌ఫోన్‌ను ట్రేస్ చేయగా ఏడు రోడ్ల కూడలి సమీపంలో ఉన్న పార్క్ వద్ద గుర్తించామన్నారు. హాస్టల్ నుంచి బయటకు వచ్చిన లక్ష్మి ఓ వ్యక్తితో మాట్లాడడాన్ని పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆ దిశగా విచారణ చేపట్టారన్నారు. ఆ వ్యక్తి సారవకోట మండలం గోవర్ధనపురానికి చెందిన కణితి జగదీష్‌గా గుర్తించారన్నారు. సెల్ లొకేషన్ ఆధారంగా అతడిని పట్టుకుని విచారించగా తానే దాడి చేసినట్టు అంగీకరించాడని తెలిపారు. జగదీష్‌తో లక్ష్మికి ముందే పరిచయం ఉందన్నారు. ఆ రోజు రాత్రి జగదీష్, లక్ష్మీ కలిసి తిరిగారన్నారు. తనను పెళ్లి చేసుకోవాలని లక్ష్మిని జగదీష్ కోరగా ఒప్పుకోకపోవడంతో దాడి చేశాడన్నారు. జగదీష్ జూనియర్ ఆర్టిస్ట్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. ఈ కేసును 48 గంటల్లో ఛేదించిన డీఎస్పీ వివేకానంద, టౌన్ సీఐ పి.పైడపునాయుడు, వన్ టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణలను ఎస్పీ అభినందించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546